క్లుప్తంగా

సురక్షిత ప్రయాణాలు చేయండి


ఎస్‌ఐ కళాధర్

వీరఘట్టం: సంక్రాంతి పండగ వేళ అందరూ సురక్షిత ప్రయాణాలు చేయాలని ఎస్‌ఐ జి. కళాధర్ సూచించారు. ఇదే విషయమై ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పరిమిత వేగం, ప్రయాణికులతో ప్రయాణించాలని తెలిపారు. పండగ సరదాలో మద్యం మత్తులో వేగంగా వాహనాలు నడిపి గతంలో ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పండగ పూట ప్రయాణాలు ఎక్కువగా చేయాల్సి ఉంటుందని, సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకునేలా చూడాలన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకోవాలని తెలిపారు.

కనులపండువగా గోదాదేవి కల్యాణోత్సవం


బలిజిపేట: వెంగాపురం రామాలయంలో గోదాదేవి, రంగనాథుల కల్యాణం

బలిజిపేట: మండలంలో వివిధ గ్రామాలలో రామాలయాల వద్ద గోదాదేవి కల్యాణోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. వెంగాపురం రామాలయంలో అర్చకులు గోపాలకృష్ణ, కె.సూర్యనారాయణ, కె.ఫణికుమార్‌ల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు కల్యాణం చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా..

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నదీ తీరాన వేంచేసిన గోదాదేవి, వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రధానార్చకుడు పి. శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణం నిర్వహించారు. వేకువజామున గోవింద మాలలు ధరించిన భక్తులు ఉత్సవ మూర్తులను పల్లకీలో ఊరేగించారు. అనంతరం కల్యాణం నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇచ్చిన హామీ అమలు చేయాలి

సీతానగరం: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యుత్ చార్జీలు పెంచడాన్ని ఖండిస్తూ భోగిమంటల్లో విద్యుత్ బిల్లులు దహనం చేస్తూ సోమవారం వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు ఆర్. రాము, సీఐటీయూ జిల్లా నాయకుడు జీవీ రమణ మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన వెంటనే విద్యుత్ బిల్లులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్మార్ట్‌మీటర్ల వల్ల వినియోగదరులపై ఆర్థికభారం పడుతుందన్నారు. వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించడంతో పాటు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

రాజాం: సంక్రాంతి పండగ వేళ.. కోడిపందాలు, పేకాట శిబిరాలు, పొట్టేళ్ల పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాజాం రూరల్ సీఐ హెచ్. ఉపేంద్ర హెచ్చరించారు. ఇదే విషయమై ఆయన స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఎక్కడైనా అట్టాట, పేకాట శిబిరాలు నిర్వహించినా, పందాలు ఆడుతున్నా సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రశాంత వాతావరణంలో అందరూ పండగ చేసుకోవాలని, అవాంఛనీయ ఘటనలకు పాల్పడవద్దని తెలిపారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

వంగర: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ అని, ఎంపీటీసీ కె.సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని కొప్పర గ్రామంలో మూడు రోజుల పాటు జరిగిన మండల స్థాయి వాలీబాల్ పోటీలు సోమవారంతో ముగిశాయి. అనంతరం ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన కొప్పర జట్లతో పాటు తృతీయ, నాలుగో స్థానాల్లో నిలిచిన నారాయణపురం, గీతనాపల్లి జట్లకు ట్రోఫీలు అందజేశారు.

అధ్వానంగా రోడ్లు.. జనం అవస్థలు!


వీరఘట్టం: నవగాం దగ్గరలో మరోచోట భారీ గుంత

రోడ్లు అధ్వానంగా ఉండడంతో జనం అవస్థలు పడుతున్నారు. ఎక్కడ ఏ రోడ్డు చూసినా మరమ్మతులకు గురై ప్రమాదకరంగా కనిపిస్తోంది. అడుగుకో గుంత.. గజానికో గొయ్యి.. మాదిరి కనిపిస్తోంది. గుంతలమయమైన రోడ్డు ఓ చోట, చిన్నపాటి వర్షానికి బురదమయమైన రోడ్డు మరోచోట, రాళ్లు తేలిన రోడ్డు ఇంకోచోట దర్శనమిస్తున్నాయి. సంక్రాంతి పండగకు స్వగ్రామం బాటపడుతున్న వలసదారులు ఇంకా రోడ్లు బాగు చేయలేదా అని ప్రభుత్వంపై మండిపడుతున్నారు. మరోవైపు నిత్యం రాకపోకలు సాగించేవారు రోడ్లలో ఎగసిపడుతున్న దుమ్మూధూళితో ఊపిరితిత్తులు దెబ్బతింటున్నాయని, వాహనాలు సైతం పాడవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గర్భిణులను ఆస్పత్రికి తీసుకువెళ్లాలంటే నరకయాతన పడుతున్నామని వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని, రోడ్లు బాగు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

-పాలకొండ, కురుపాం నెట్‌వర్క్


వీరఘట్టం: అధ్వానంగా వండువ సమీపంలో తారురోడ్డు


వీరఘట్టం: నవగాం సమీపంలో మరమ్మతులకు గురైన రోడ్డు


భామిని: పసుకుడి వద్ద నామమాత్రంగా చేసిన రోడ్డు మరమ్మతులు


భామిని: గురండి రైస్‌మిల్లు వద్ద పాడైన రోడ్డు


భామిని: అస్తవ్యస్తంగా భామిని మండల కేంద్రం తారురోడ్డు

పర్యాటకుల సందడి

పార్వతీపురం మన్యం జిల్లా, సీతంపేట అడ్వంచర్ పార్కులో పర్యాటకులు సందడి చేశారు. సంక్రాంతి సెలవులు కావడంతో సందర్శకులతో పార్కు పరిసరాలు కళకళలాడాయి. మన్యం అందాలను వీక్షించేందుకు వచ్చిన వారంతా ఇక్కడి పార్కుతో పాటు మెట్టుగూడ జలపాతం, ఆడలి వ్యూ పాయింట్ అందాలను చూసి, మంత్రముగ్ధులయ్యారు. ప్రధానంగా పార్కులోని జలవిహార్‌లో చిన్నారులు బోటుషికారు చేసి, సరదాగా గడిపారు. అలాగే యువత సాహస క్రీడలు ఆడి, ఆనందించారు.

-సీతంపేట


జలవిహార్‌లో పర్యాటకుల బోటుషికారు


త్రీడీ థియేటర్‌లో అడ్వంచర్ సినిమా చూస్తున్న సందర్శకులు


స్కై సైక్లింగ్ చేస్తున్న పర్యాటకులు

ఘనంగా గోదాదేవి కల్యాణం

పాలకొండ: స్థానిక కోదండరామస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఏటా భోగి పండగ రోజున ఈ కల్యాణం జరిపిస్తుండడం ఆనవాయితీగా వస్తోందని అర్చకులు తెలిపారు. కల్యాణోత్సవం తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం అమ్మవారి చిత్రపటాన్ని ఊరేగించారు.


అమ్మవారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పూర్వ విద్యార్థులు

పాలకొండ: స్థానిక నవోదయ పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం జరిగింది. 2009 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులంతా దాదాపు 15 ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకోవడంతో ఎంతో ఆప్యాయంగా పలకరించుకుని, ఆనాటి తమ తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ..


కార్మికులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ గున్నేశ్వరరావు


చీరలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు రాఘవకుమార్

పార్వతీపురం: సంక్రాంతి పండగ నేపథ్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు యిండుపూరు గున్నేశ్వరరావు సోమవారం తన నివాసం వద్ద మున్సిపల్ కార్మికులు, కలాసీలకు దుస్తులు పంపిణీ చేశారు. 138 మంది కార్మికులు, 50 మంది కలాసీలకు దుప్పట్లు, చీరలు, తువ్వాళ్లు, నగదు అందజేశారు. కార్యక్రమంలో ఉషారాణి, వెంకటేష్ బాబు, సుష్మ, సీఐటీయూ నాయకులు గొర్లె వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, సంఘసేవకుడు కేతిరెడ్డి రాఘవకుమార్ సంక్రాంతి పండగ సందర్భంగా తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. దాదాపు 20 సంవత్సరాలుగా వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన చెప్పారు.

బర్లిలో..


బలిజిపేట: పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఏగిరెడ్డి కుటుంబీకులు

బలిజిపేట: సంక్రాంతి సందర్భంగా బర్లి గ్రామంలో ఏగిరెడ్డి వెంకటినాయుడు, భారతి జ్ఞాపకార్థం వారి కుటుంబీకులు అన్నపూర్ణమ్మ, నానిబాబు, గౌరీశ్వరరావు, తదితరులు 950 మంది నిరుపేదలకు చీరలు, లుంగీలు, తువ్వాళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

డ్రగ్స్ షార్ట్‌ఫిల్మ్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ విడుదల చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బొబ్బిలి: స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డ్రగ్స్ షార్ట్‌ఫిల్మ్‌కు సంబంధించిన పోస్టర్‌ను డీఎస్పీ పి.శ్రీనివాసరావు సోమవారం ఆవిష్కరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనే ప్రధానాంశంగా డ్రగ్స్.. ఇంపాక్ట్ ఆన్ సొసైటీ(సమాజంపై దాని ప్రభావం) పేరుతో రూపుదిద్దుకుంటున్న ఈ లఘు చిత్రం ద్వారా డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ కె.సతీష్ కుమార్, ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



పాలకొండను పొగమంచు కమ్మేస్తోంది. రాత్రి 8 గంటల నుంచే మంచు కురవడం ప్రారంభమై, ఉదయం 9 గంటల వరకు ఉంటోంది. దట్టంగా కురుస్తున్న మంచు కారణంగా ఎక్కడ ఏం ఉందో కానరావడం లేదు. ఎదురుగా వస్తున్న మనిషి దగ్గరకు వస్తే గానీ కనిపించని దుస్థితి. దీంతో అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు వెళ్లడం లేదు. ఒకవేళ వెళ్తే టార్చిలైట్లు, సెల్‌ఫోన్ల లైట్లు వేసుకుని మరీ వెళ్తున్నారు. మంచుతో పాటు చలితీవ్రత కూడా పెరగడంతో ఉదయం, రాత్రి వేళల్లో జనం చలిమంట కాగుతూ ఉపశమనం పొందుతున్నారు.

-పాలకొండ రూరల్

అపూర్వ కలయిక..



తెర్లాం/బాడంగి/రాజాంసిటీ: మండలాల్లోని పలు గ్రామాల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అట్టహాసంగా సోమవారం జరిగింది. తెర్లాం గౌతమ్ హైస్కూల్‌లో 2004-05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు, బాడంగి హైస్కూల్ 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు, రాజాం మండలంలోని డోలపేట ఉన్నత పాఠశాల 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులంతా కలుసుకుని, ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు.

అనంతరం అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి, వారి పట్ల గౌరవ భావం చాటుకున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు


ట్రాఫిక్ సమస్యను నియంత్రిస్తున్న సీఐ నారాయణరావు

రామభద్రపురం: ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని సీఐ కె.నారాయణరావు తెలిపారు. సంక్రాంతి పండగ వేళ మండల కేంద్రంలో తరచూ నెలకొనే ట్రాఫిక్ సమస్య జటిలం కాకుండా ఏర్పాటు చేసిన పోలీసులు.. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోకుండా ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారన్న అంశంపై ఆదివారం సాక్షి దినపత్రికలో ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు ప్రేక్షకపాత్ర పేరిట వార్తా కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన సీఐ.. ఆయనే స్వయంగా రంగంలోకి దిగి సోమవారం ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ఆయన అన్నారు.

భోగభాగ్యాల భోగి


గుమ్మలక్ష్మీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వేసిన భోగి మంట వద్ద చలికాగుతున్న ప్రజలు


గరుగుబిల్లి మండల కేంద్రంలోని వేసిన భోగి మంట

వాడవాడలా భోగి పండగ సోమవారం ఘనంగా నిర్వహించారు. చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రతిఒక్కరూ భోగి మంట వద్దకు చేరుకుని, చలి కాగుతూ సరదాగా గడిపారు. తమ వెంట తీసుకువచ్చిన పాత వస్తువులతో పాటు పిడకలు, కర్రలను ఆ భోగి మంటలో పడేసి, అందరి జీవితాలు భోగభాగ్యాలతో వెల్లివిరియాలని భగవంతుడిని కోరుకున్నారు. అనంతరం భోగి స్నానాలు ఆచరించి, చిన్నారులపై భోగి పండ్లు పోశారు. ఏటా సంక్రాంతి ముందు రోజు ఈ భోగి వేడుక జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుండడం గమనార్హం.

-పాలకొండ, కురుపాం నెట్‌వర్క్


జియ్యమ్మవలస: వెంకటరాజపురంలో భోగి వేడుకల్లో పాల్గొన్న యువత


వీరఘట్టం గెంబలి వీధిలో వేసిన భోగి మంట వద్ద స్థానికుల సందడి


భామిని: నేరడి గ్రామంలో వేసిన భోగి మంట వద్ద గ్రామస్తులు